# విలాసరావు డైరీ

పత్తిసుబ్బిరెడ్డిగారు

అది సాయంసమయము. ఆకాశంబునం దచ్చటచ్చట మేఘమాలికలు మందగమన మొనర్చుచున్నట్లు పొడకట్టుచున్నవి. పర్వత భాగమునుండి సెలయేఱు గలగల ధ్వనులు చేయుచు నొకలోయనుండి ప్రవహించు చుండెను. ఆప్రకృతి యానందసమయమున మయూరములు విశాలపించ్ఛములను విప్పి నాట్యము సల్పుచుండెను. హరిణములు యిసుక తిన్నెలపై నటునిటు పరువిడుచుం డెను. వృక్షాగ్రములనుండి, శుక, పికములు కలకలారావములు చేయుచు మధురమంజుల గానముతో ప్రకృతి శ్రోత్రపేయ మొనర్చు చుండెను.

మానవ మాత్రుడైన విలాసరావు తన జీవితకాలములో ప్రకృతి యానందమన నేమిటో యెరుగడు. మురుగుడు కాల్వల యినస్పెక్టరు బిరుదువహించిన మేయోకన్య వలె, మంచినివిడచి, చెడ్డను అన్వేషించు స్వభావముగలవాడు. ఎన్నిసభలకు పోయి నను, యేగ్రంథము చదివినను, మంచినిరోసి, చెడ్డనే వెదకుచుండును. ఈతనికి స్త్రీవిద్యా స్వాతంత్ర్యములు గిట్టవు.

ఇతని దృష్టి యెక్కువగా స్త్రీల సమాజ ముల మీదకే ఉరుకుచుండును. ఎక్కడనేని నలుగురుస్త్రీలు సమావేశమై, దేశసేవ, ఆరోగ్య, సౌభాగ్యములనుగురించి ముచ్చ టించుకొనుచుండినచో, వాలుజడలవారని, వంకపాపిళ్లవారని, సేలంచీరలవారని, లేకయే మగకుంకో బృహన్నలవలె తయారై స్త్రీల సభలో కూర్చున్నాడని వర్ణించుట విలాస రావునకు పరిపాటియైపోయినది. మహిళా మణులయొక్క సుస్వభావగరిమ, అకుంఠిత ప్రేమతత్త్వము, దేశసేవాపరాయణత గ్రహిం చుకొనే విశాల హృదయముగా దతనిది. సేలంచీరలు ధరించినా, వాలు జడలువేసినా, ఒకేమాదిరికట్టు, బొట్టుగల జాతీయచిహ్నా ములు యిప్పటికిని స్త్రీలయందే నిలచియున్న వనుటలో అతిశయోక్తిలేదు. గుజరాతివనిత వోలె మేలిముసుగు, సింధుదేశపు స్త్రీవలె ఏకపొరతో కప్పబడుకోకకట్టు, పార్శిపడతుల రీతి అర్ధవక్షోభాగపమిటలుగాని ధరించుట లేదు. పురుషుల సమావేశ చాయాపట ములు కొన్ని పరిశీలింపుడు. బెంగాలు బిళ్ల వదుల గోచెలతో కొందఱు, గుజరాతు పొడుగుకోట్లుతో మఱికొందఱు, దొరలతోపీ

లతో కొందఱు ప్రస్తుతము ప్రత్యక్షమవుతారు. విలాసరావు విద్యావంతుడై నను కూపస్థమండూకము. వివిధమత, కట్టు, బొట్లును గురించి సమన్వయము చేసుకొనే శక్తి అతనికిలేదు.

"పుట్రెలో జనించినబుద్ధి పుడకలతోగాని పోవదు"అను సామెతయున్నను, కొన్నిదైవ ఘటనలవల్లను, దివ్యప్రబోధముల మూలమునను, మానవునిమనస్సు మంచిలోకి మారును. పొన్నూరులో స్త్రీల మీటింగు జరుగునని తెలియుటతోడనే విలాసరావు అక్కడకు పరుగిడిపోయెను. ఆసభకు పురుషులు పోవుటకు యుత్తరువు లేనందున విలాసరావు ఆభవన ప్రహారీకుడ్యశిఖర పరిభాగమును పట్టుకొని, పరికింపనుద్యుక్తుడాయెను. గోడశిఖరం యిటుకపట్టువదలుటచే నాతడు తటాలున క్రిందపడిపోయెను.

ధనపిపాసా పీడితమైన నేటికాలమున నలుగురైదుగురు పురుషులు ఆమార్గమున పోయిరి గాని,కష్టస్థితిలోనున్న విలాసరావుకు ఉపచర్య చేయువారు లేకపోయిరి. పసుపు రంగుగల ఖద్దరుచీర, అదేచాయగల రవికయు, మెడలో మాంగల్యముతోనున్న అల్లికపేరు, నల్లని దీర్ఘకురులు సవరించుకొని వేయబడిన వ్రేలిముడి,విశాలమైననేత్రములు, ప్రసన్నమైన వదనము, నిరంతర దేశసేవా తత్పరతయునైన నొక యువతీలలామ, తడివస్త్రముతో విలాసరావు వదనము, శిరస్సు నొత్తి, గాయములు తగిలినచోట, కట్లు కట్టుచు, పరిచర్యచేయుచుండెను. అంతట విలాసరావునకు స్పృహవచ్చి—"అవ్యాజ కరుణాకటాక్షముతో నన్ను బ్రతికించితివి. అమ్మా నీవెవరవు?"అని ప్రశ్నించెను. "తండ్రీ! నేను మహిళాసేవాసదన సభ్యురాలను. మాకార్యక్రమము, సభలు, పత్రికలు, యుపన్యాసములద్వారానేగాక ఆచరణయోగ్యముగా నుండగలందులకే పాటుపడుచున్నామని నుడివి కార్యాంతర్యామియయ్యెను.

విలాసరావు, యిదివఱలో నార్జించిన పాపప్రతతియంతయు, మహోజ్జ్వల మార్తాండుని ద్యుతిచే మంచు విడిపోయినట్లు ఆదివ్య మంగళ స్వరూపియగు మహిళామణి సందర్శనముచే పటాపంచలై పోయెను.

ద్యుమణిపద్మాకరము వికచముగజేయు<br>
గుముదహర్షంబుగావించు నమృతసూతి<br>
యర్థితుడుగాక జలమిచ్చు నంబుధరుడు<br>
సజ్జనులు దారె పరహితాచరణమతులు॥

'భర్తృహరి.'